## రోల్స్-రాయిస్ తొలి లగ్జరీ ఈవీ..

### ప్రారంభ ధర రూ.7.5 కోట్లు



న్యూఢిల్లీ, జనవరి 19: లగ్జరీ కార్ల తయారీ సంస్థ రోల్స్-రాయిస్..దేశీయ మార్కెట్లోకి తొలి ఎలక్ట్రిక్ వాహనాన్ని పరిచయం చేసింది. స్పెక్టా పేరుతో విడుదల చేసిన తొలి ఎలక్ట్రిక్ లగ్జరీ సెడాన్ కారు ఇదేనని తెలిపింది. ఈ కారు ప్రారంభ ధర రూ.7.5 కోట్లుగా నిర్ణయించింది. పూర్తి స్థాయి బ్యాటరీ రీచార్జి కావడానికి ఐదు గంటలు పట్టనున్నది. ఇలా బ్యాటరీ రీచార్జితో 530 కిలోమీటర్లు ప్రయాణించనున్నదని తెలిపింది. ఢిల్లీ, చెన్నై, హైదరాబాద్‌లలో ఉన్న షోరూంలలో మాత్రమే ఈ కారు లభించనున్నది. ఈ సందర్భంగా రోల్స్-రాయిస్ కార్లను విక్రయిస్తున్న సెలెక్ట్ కార్స్ సీఈవో యాదుర్ కపూర్ మాట్లాడుతూ..దేశ ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటుండటంతో లగ్జరీ కార్లకు డిమాండ్ పెరిగే అవకాశం ఉందన్నారు. బ్రిటన్ నుంచి దిగుమతి చేసుకొని దేశీయంగా విక్రయిస్తుండటంతో ఈ కారు కోసం ఆరు నుంచి ఎనిమిది నెలలపాటు వేచి చూడాల్సిందేనని చెప్పారు.

## పెరిగిన విదేశీ మారక నిల్వలు


ముంబై, జనవరి 19: దేశం వద్దనున్న విదేశీ మారక నిల్వలు (ఫారెక్స్) తిరిగి పెరిగాయి. ఈ నెల 12తో ముగిసిన వారంలో ఇవి 1.63 బిలియన్ డాలర్ల మేర పెరిగి 618.94 బిలియన్ డాలర్ల స్థాయికి చేరినట్టు రిజర్వ్‌బ్యాంక్ శుక్రవారం తెలిపింది. అంతక్రితం వారంలో ఇవి భారీగా 5.89 బిలియన్ డాలర్ల మేర క్షీణించాయి. 2021 అక్టోబర్‌లో 645 బిలియన్ డాలర్ల రికార్డుస్థాయికి చేరిన తర్వాత మళ్లీ ఆ స్థాయికి నిల్వలు కోలుకోలేదు. ఒకదశలో ఇవి 520 బిలియన్ డాలర్ల వద్దకు పడిపోయాయి. అటుతర్వాత క్రమేపీ కోలుకుని రికార్డుస్థాయిని సమీపిస్తున్నాయి.ఈ జనవరి 12తో ముగిసిన వారంలో విదేశీ నిల్వల్లో అధికభాగమైన విదేశీ కరెన్సీ ఆస్తులు 1.859 బిలియన్ డాలర్లు పెరిగి 548.508 బిలియన్ డాలర్లకు చేరాయి. డాలర్ మారకంలో వెల్లడించే విదేశీ కరెన్సీ ఆస్తుల్లో..అమెరికాయేతర కరెన్సీల విలువల్లో ఏర్పడిన పెరుగుదల లేదా తరుగుదలను పరిగణనలోకి తీసుకుంటారు.

**బంగారం నిల్వల్లో తరుగు**

సమీక్షా వారంలో ఆర్బీఐ వద్దనున్న బంగారం నిల్వలు మాత్రం తరిగిపోయాయి. ఇవి 242 మిలియన్ డాలర్ల మేర క్షీణించి 47.247 బిలియన్ డాలర్లకు తగ్గినట్టు ఆర్బీఐ తెలిపింది. స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ (ఎస్‌డీఆర్‌లు) 12 మిలియన్ డాలర్లు పెరిగి 18.31 బిలియన్ డాలర్లకు చేరాయి. ఐఎంఎఫ్ వద్ద ఉంచిన రిజర్వుల విలువ 6 మిలియన్ డాలర్లు పెరిగి 4.872 బిలియన్ డాలర్ల వద్ద నిలిచాయి.

# ఆర్‌ఐఎల్ అదరహో

### క్యూ3 లాభం రూ.17,265 కోట్లు • ఆదాయం రూ.2.2 లక్షల కోట్లు





ముంబై, జనవరి 19: దేశంలో నంబర్‌వన్ కార్పొరేట్ కంపెనీ ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్‌ఐఎల్) క్యూ3 ఆర్థిక ఫలితాలు విశ్లేషకుల అంచనాలకు అనుగుణంగా వెల్లడయ్యాయి. రిఫైనరీ మెయింటెనెన్స్ కారణంగా ఆయిల్ వ్యాపారపు రాబడులు తగ్గుతాయని, రిటైల్, టెలికం వ్యాపారాలు స్థిరంగా ఉంటాయన్న అంచనాల మేరకు 2023 డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికంలో ఆర్‌ఐఎల్ నికరలాభం 9 శాతం వృద్ధిచెంది రూ.17,265 కోట్లకు (షేరుకు లాభం రూ.25.52) చేరినట్లు ఆర్‌ఐఎల్ శుక్రవారం తెలిపింది. క్రితం ఏడాది రూ.15,792 కోట్ల నికరలాభాన్ని నమోదు చేసింది. తాజాగా ముగిసిన క్యూ3లో కంపెనీ కార్యకలాపాల ఆదాయాన్ని దాదాపు ఫ్లాట్‌గా రూ.2.28 లక్షల కోట్ల మేర ప్రకటించింది. వివరాలు..

- ప్రస్తుత ఖాతా సంవత్సరం క్యూ2తో పోలిస్తే ఆదాయం 3 శాతం, లాభం 0.7 శాతం చొప్పున తగ్గాయి.
- కానీ కంపెనీ ఆపరేటింగ్ మార్జిన్లను గణనీయంగా మెరుగుపర్చుకుంది. ఈ మార్జిన్ ఏడాది క్రితంకంటే 210 బేసిస్ పాయింట్లు, క్యూ2కంటే 50 బేసిస్ పాయింట్ల చొప్పున పెరిగి 18 శాతానికి చేరింది.
- ఇబిటా 16.7 శాతం వృద్ధితో రూ.44,678 కోట్లకు చేరింది.
- ప్రధాన వ్యాపారమైన ఆయిల్ రిఫైనింగ్, పెట్రోకెమికల్స్ ఆదాయం 2.4 శాతం క్షీణించగా, ఇబిటా 1 శాతం వృద్ధితో రూ.14,064 కోట్లకు చేరింది. క్యూ2లో ఈ వ్యాపారం ఇబిటా రూ.16,281 కోట్ల కంటే క్యూ3లో గణనీయంగా తగ్గింది.
- వడ్డీ వ్యయాలు 11 శాతం ఎగిసి రూ. 5,789 కోట్లకు పెరిగాయి.
- క్యూ2తో పోలిస్తే క్యూ3లో మూలధన వ్యయాలు రూ.38,815 కోట్ల నుంచి రూ. 30,102 కోట్లకు తగ్గాయి.
- డిసెంబర్ చివరినాటికి రూ.1.92 లక్షల కోట్ల నగదు, తత్సమాన నిల్వలు కంపెనీ వద్ద ఉన్నాయి. క్యూ2లో ఇవి రూ.1.78 లక్షల కోట్లు.
- రుణ భారం రూ.2.96 లక్షల కోట్ల నుంచి రూ.3.12 లక్షల కోట్లకు చేరింది.

### జియో లాభం రూ. 5,445 కోట్లు

ఆర్‌ఐఎల్ టెలికం సబ్సిడరీ రిలయన్స్ జియో నికరలాభం 12.2 శాతం వృద్ధితో రూ. 5,208 కోట్లకు చేరింది. 2022 డిసెంబర్ త్రైమాసికంలో ఇది రూ. 4,638 కోట్లు. ఇదే సమయంలో జియో ఆదాయం 10.3 శాతం పెరిగి రూ. 22,998 కోట్ల నుంచి రూ. 25,368 కోట్లకు చేరింది. జియో ప్లాట్‌ఫామ్స్ ఇబిటా 11 శాతం వృద్ధితో రూ. 13,955 కోట్లకు చేరింది. ఒక్కో యూజర్ నుంచి సమకూరే సగటు ఆదాయం (ఏపీఆర్‌యూ) 2 శాతం పెరిగి 181.7కు చేరింది. సెప్టెంబర్ చివరినాటికి 45.97 కోట్లు ఉన్న చందాదారుల సంఖ్య డిసెంబర్ చివరికి 47.09 కోట్లకు పెరిగింది.

**రిటైల్ లాభంలో 40 శాతం వృద్ధి**

ఆర్‌ఐఎల్ వ్యాపార విభాగమైన రిలయన్స్ రిటైల్ మాత్రం క్యూ3లో లాభాల్ని గణనీయంగా పెంచుకుంది. డిసెంబర్ క్వార్టర్లో ఇది 40 శాతం వృద్ధిచెంది రూ. 3,165 కోట్లకు పెరిగింది. క్యూ3లో స్టోర్ల సంఖ్య 18,774 కోట్లకు చేరగా, క్యూ2తో పోలిస్తే స్టోర్లను సందర్శించిన వినియోగదారుల సంఖ్య 26 కోట్ల నుంచి 28.2 కోట్లకు పెరిగారు. గ్రోసరీ వ్యాపారం వృద్ధి 1 శాతానికి పరిమితమైనప్పటికీ, ఇతర రిటైల్ విభాగాల్లో విక్రయాలు జోరుగా జరిగినట్టు ఆర్‌ఐఎల్ తెలిపింది.

*దేశవ్యాప్తంగా 5జీ సర్వీసుల రోల్‌అవుట్‌ను జియో వేగంగా పూర్తిచేసింది. ప్రతీ నగరం, పట్టణం, గ్రామంలో ఇప్పుడు హైస్పీడ్ డిజిటల్ కనెక్టివిటీని అందుబాటులోకి తెచ్చాం. కొత్త బ్రాండ్లను అందించడం ద్వారా ఖాతాదారుల షాపింగ్ అనుభవాన్ని పెంపొందించడంపై రిలయన్స్ రిటైల్ దృష్టినిలిపింది. ఆయిల్, గ్యాస్ వ్యాపారం రికార్డుస్థాయి ఇబిటాను సాధించింది. భారత్ గ్యాస్ ఉత్పత్తిలో ఇప్పుడు 30 శాతం కేజీ డీ6 నుంచే వస్తున్నదని వెల్లడించడానికి సంతోషిస్తున్నా. ఈ ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో న్యూ ఎనర్జీ గిగా కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తాం*

*-ముకేశ్ అంబానీ, ఆర్‌ఐఎల్ సీఎండీ*



కొత్త పాలసీ జీవన్ ధార IIని పరిచయం చేస్తున్న ఎల్ఐసీ చైర్‌పర్సన్ సిద్ధార్థ మహంతి

## ఎల్ఐసీ జీవన్ ధార II

ముంబై, జనవరి 19: ప్రభుత్వ రంగ జీవిత బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) శుక్రవారం ఓ సరికొత్త ప్లాన్‌ను పరిచయం చేసింది. 'జీవన్ ధార II (ప్లాన్ 872)' పేరుతో దీన్ని సంస్థ చైర్‌పర్సన్ సిద్ధార్థ మహంతి ప్రారంభించారు. సోమవారం నుంచి ఇది కొనుగోలుదారులకు అందుబాటులో ఉంటుంది. ఇదో ఇండివిడ్యువల్, సేవింగ్స్, డిఫర్డ్ యాన్యుటీ, నాన్-లింక్డ్, నాన్-పార్టిసిపేటింగ్ ప్లాన్. దీని యూనిక్ ఐడెంటిఫికేషన్ నంబర్ (యూఐఎన్): 512N364V01. సంస్థ ఏజెంట్ల ద్వారాగానీ, ఇతర మధ్యవర్తిత్వ వేదికలద్వారానైనా లేదా నేరుగా ఆన్‌లైన్‌లో ఈ ప్లాన్‌ను కొనుగోలు చేయవచ్చు.

**పాలసీ విశేషాలు**

- 20 ఏండ్లు దాటినవారే ఈ ప్లాన్‌కు అర్హులు. అలాగే ఎంచుకునే యాన్యుటీ ఆప్షన్‌నుబట్టి గరిష్ఠ వయస్సు 80, 70, 65 ఏండ్లుగా ఉన్నది.
- ప్లాన్ మొదలైన దగ్గర్నుంచి యాన్యుటీ హామీ ఉంటుంది. పాలసీదారులకు 11 యాన్యుటీ ఆప్షన్స్‌ను ఎల్ఐసీ అందుబాటులో ఉంచింది.
- వయసు పెరిగినకొద్దీ అధిక యాన్యుటీ రేట్లు అందుకోవచ్చు. అధిక ప్రీమియంలకు ప్రోత్సాహకాలు అందుతాయి.
- వాయిదాల వ్యవధిలో లైఫ్ కవరేజీ.
- పాలసీదారులు రెగ్యులర్, సింగిల్ ప్రీమియంలను ఎంచుకోవచ్చు.
- సింగిల్ లైఫ్ యాన్యుటీ, జాయింట్ లైఫ్ యాన్యుటీలుంటాయి.
- రెగ్యులర్ ప్రీమియంలో వాయిదా వ్యవధి ఐదేండ్ల నుంచి 15 ఏండ్లదాకా ఉంటుంది. సింగిల్ ప్రీమియంలోనైతే ఏడాది నుంచి 15 ఏండ్లు. మీ అవసరాలకు అనుగుణంగా యాన్యుటీ చెల్లింపులు మొదలైనప్పట్నుంచి ఇవి వర్తిస్తాయి.
- యాన్యుటీ చెల్లింపులు నెలకోసారి, 3 నెలలకోసారి, 6 నెలలకోసారి, ఏడాదికోసారి చేసుకోవచ్చు.
- పాలసీ వ్యవధి వాయిదా కాలంలో ఎప్పుడైనాసరే సింగిల్ ప్రీమియంగా అదనపు మొత్తాన్ని చెల్లించి యాన్యుటీని పెంచుకునే వెసులుబాటు.
- ఈ ప్లాన్‌లో పాలసీదారుడు చనిపోతే వచ్చే ఆ మొత్తాన్ని ఒకేసారి లేదా వాయిదాల్లో నామినీలు తీసుకోవచ్చు. ఇందుకు తగ్గట్టుగా ఆ మేరకు ఆయా ప్రయోజనాలు అందుతాయి.
- పాలసీపై రుణ సదుపాయం లభిస్తుంది.

# మూడు రోజుల పతనానికి బ్రేక్

### భారీగా లాభపడిన స్టాక్ మార్కెట్లు

ముంబై, జనవరి 19: స్టాక్ మార్కెట్ల వరుస పతనాలకు బ్రేక్‌పడింది. బ్లూచిప్ సంస్థల షేర్లకు మదుపరుల నుంచి లభించిన మద్దతుకు తోడు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలు సూచీలను లాభాలవైపు నడిపించాయి. వరుసగా మూడు రోజులుగా నష్టాలే పరమావధిగా కొనసాగిన సూచీలు ఎట్టకేలకు లాభాల్లోకి మళ్లాయి. ప్రారంభం నుంచే లాభాల బాట పట్టిన సూచీలు వారాంతం ట్రేడింగ్ ముగిసే సరికి భారీగా లాభపడింది. ఒక దశలో 700 పాయింట్లకు పైగా లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 496 పాయింట్లు అందుకొని 71,683.23 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ 21,600 పాయింట్ల కీలక స్థాయిని అధిగమించింది.



**4 లక్షల కోట్లు పెరిగిన సంపద**

*గత మూడు సెషన్లుగా నష్టాలతో కాలంవెళ్లదీసిన మదుపరులు తిరిగి లాభపడ్డారు. స్టాక్ మార్కెట్లు భారీగా లాభపడటంతో వీరి సంపద రూ.4 లక్షల కోట్ల మేర పెరిగింది. దీంతో బీఎస్ఈలో లిస్టైన కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ విలువ రూ.4 లక్షల కోట్లు పెరిగి రూ.373.57 లక్షల కోట్లకు చేరుకున్నది. అంతర్జాతీయ మార్కెట్లు పుంజుకోవడం, ముఖ్యంగా అమెరికా సూచీలు లాభాల్లో ముగియడం మదుపరులకు జోష్‌నిచ్చిందని దలాల్‌స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి.*

**హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తీరు అంతే..**

వరుసగా నాలుగో రోజు శుక్రవారం కూడా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు పడిపోయింది. బ్యాంక్ షేరు 1.08 శాతం పతనం చెందింది. దీంతో గత మూడు సెషన్లలో బ్యాంక్ షేరు 12 శాతం పతనం చెందినట్లు అయింది. బ్యాంక్ నాలుగో త్రైమాసికపు ఆర్థిక ఫలితాలు విడుదలైన నాటినుంచి షేరు దిగువముఖం పట్టింది.

- భారతీ ఎయిర్‌టెల్ 3.52 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది.
- ఎన్‌టీపీసీ, టెక్ మహీంద్రా, టాటా స్టీల్, మహీంద్రా, అల్ట్రాటెక్ సిమెంట్‌లు రెండు శాతానికి పైగా బలపడ్డాయి.
- టైటాన్, యాక్సిస్ బ్యాంక్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఎల్‌అండ్‌టీ, ఐటీసీ, ఐసీఐసీఐ బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్, మారుతి, ఇన్ఫోసిస్, టీసీఎస్‌లు ఒక్క శాతానికి పైగా లాభపడ్డాయి.
- వీటితోపాటు పవర్‌గ్రిడ్, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌యూఎల్, విప్రో, టాటా మోటర్స్, నెస్లె, ఏషియన్ పెయింట్స్, హెచ్‌సీఎల్ టెక్, రిలయన్స్ షేర్లు పెరిగాయి.
- కానీ, ఇండస్‌ఇండ్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కొటక్ బ్యాంక్, ఎస్బీఐ, సన్ ఫార్మా షేర్లు నష్టపోయాయి.
- ఈ వారంలో బీఎస్ఈ సెన్సెక్స్ 885.22 పాయింట్లు లేదా 1.21 శాతం, నిఫ్టీ 272.15 పాయింట్లు లేదా 1.24 శాతం నష్టపోయాయి.
- బీఎస్ఈ మిడ్‌క్యాప్ 1.69 శాతం, స్మాల్ క్యాప్ ఇండెక్స్‌లు 1.06 శాతం లాభపడ్డాయి.
- రంగాలవారీగా చూస్తే ఆయిల్ అండ్ గ్యాస్ 2.17 శాతం, మెటల్ 1.69 శాతం, ఇండస్ట్రియల్స్ 1.62 శాతం, ఎనర్జీ 1.58 శాతం, కమొడిటీస్ 1.44 శాతం, టెక్ 1.29 శాతం, ఐటీ 1.06 శాతం చొప్పున పెరిగాయి.
- గత మూడు సెషన్లలో బీఎస్ఈ సెన్సెక్స్ 2.91 శాతం, నిఫ్టీ 2.87 శాతం పతనమైన విషయం తెలిసిందే.

**నేడు మార్కెట్లలో ట్రేడింగ్**

ఈ నెల 20 శనివారం స్టాక్ మార్కెట్లలో ట్రేడింగ్ జరుగుతుందని ఎన్ఎస్ఈ ప్రతినిధి ఒకరు తెలిపారు. సోమవారం అయోధ్యలో శ్రీరామ మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా మహారాష్ట్ర ప్రభుత్వం సెలవు ప్రకటించడంతో ఈ రోజున స్టాక్ మార్కెట్లు పనిచేయవు. దీంతో శనివారం సూచీలు పూర్తిస్థాయిలో పనిచేయనున్నాయని ప్రతినిధి తెలిపారు. సోమవారం స్టాక్ మార్కెట్లతోపాటు కరెన్సీ డెరివేటివ్ మార్కెట్లు కూడా పనిచేయవు. మరోవైపు, రిజర్వ్‌బ్యాంక్ కార్యాలయాలకు సెలవుకావడంతో ఈ సోమవారం రూ.2 వేల నోట్ల ఎక్స్ఛేంజ్, డిపాజిట్ చేసుకునే అవకాశం లేదు.



### హెచ్‌యూఎల్ లాభం 2,508 కోట్లు

న్యూఢిల్లీ, జనవరి 19: దేశంలో అతి పెద్ద ఎఫ్ఎంసీజీ సంస్థ హిందుస్థాన్ యునిలీవర్ లిమిటెడ్(హెచ్‌యూఎల్) నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. డిసెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.2,508 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.2,481 కోట్ల కంటే ఇది 1.08 శాతం అధికం. సమీక్షకాలంలో కంపెనీ విక్రయాలు రూ.15,314 కోట్ల నుంచి రూ.15,259 కోట్లకు చేరుకున్నట్లు బీఎస్ఈకి సమాచారం అందించింది. నిర్వహణ ఖర్చులు రూ.12,305 కోట్లుగా నమోదయ్యాయి. కంపెనీ కన్సాలిడేటెడ్ మొత్తం ఆదాయం రూ.15,781 కోట్లకు చేరుకున్నది.

### పెరిగిన అల్ట్రాటెక్ లాభం

న్యూఢిల్లీ, జనవరి 19: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.1,774.78 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది అల్ట్రాటెక్ సిమెంట్ లిమిటెడ్. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.1,062.58 కోట్లతో పోలిస్తే 67 శాతం పెరిగినట్లు వెల్లడించింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 7.85 శాతం అధికమై రూ.15,520.93 కోట్ల నుంచి రూ.16,739.97 కోట్లకు చేరుకున్నది. కంపెనీ చరిత్రలో ఒక త్రైమాసికంలో ఇంతటి స్థాయిలో లాభాలను ఆర్జించడం ఇదే తొలిసారని పేర్కొంది. నిర్వహణ ఖర్చులు ఏడాది ప్రాతిపదికన 2.88 శాతం ఎగబాకి రూ.14,531. 04 కోట్లకు చేరుకున్నది.

### సెంట్రల్ బ్యాంక్ లాభం ఆకర్షణీయం

న్యూఢిల్లీ, జనవరి 19: ప్రభుత్వ రంగ సంస్థ సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను రూ.718 కోట్ల నికర లాభాన్ని గడించింది. 2022-23 ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.458 కోట్ల కంటే ఇది 57 శాతం అధికం. ఏడాది క్రితం రూ.7,636 కోట్లుగా ఉన్న బ్యాంక్ ఆదాయం గత త్రైమాసికానికిగాను రూ.9,139 కోట్లకు చేరుకున్నట్లు బ్యాంక్ బీఎస్ఈకి సమాచారం అందించింది. కానీ, బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం రూ.3,285 కోట్ల నుంచి రూ.3,152 కోట్లకు తగ్గాయి. అలాగే బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 8.85 శాతం నుంచి 4.50 శాతానికి దిగిరాగా, నికర ఎన్‌పీఏ 2.09 శాతం నుంచి 1.27 శాతానికి తగ్గాయి.



## విలీన-కొనుగోళ్లు.. ఫ్చ్

### గత ఏడాది భారీగా డౌన్ • 66 బిలియన్ డాలర్లకు పరిమితం

ముంబై, జనవరి 19: దేశీయ మార్కెట్‌లో విలీన-కొనుగోళ్ల లావాదేవీల (మెర్జర్ అండ్ అక్విజిషన్స్ లేదా ఎంఅండ్ఏ డీల్స్) విలువ గత ఏడాది పెద్ద ఎత్తున పడిపోయింది. 2022తో పోల్చితే 2023లో సగానికిపైగా తగ్గిపోవడం గమనార్హం. నిరుడు 66 బిలియన్ డాలర్లుగానే ఉన్నట్టు కన్సల్టెన్సీ సంస్థ గ్రాంట్ థోంటన్ భారత్ శుక్రవారం విడుదల చేసిన నివేదిక చెప్తున్నది. అంతకుముందు ఏడాది 152 బిలియన్ డాలర్లుగా ఉన్నది. డీల్స్ పరంగా చూసినా క్షీణతే కనిపిస్తున్నది. 2023లో 1,641 డీల్స్ జరుగగా, 2022తో చూస్తే ఇది 20 శాతానికిపైగా తక్కువ. కాగా, దేశ జీడీపీ వృద్ధిరేటు బాగానే ఉన్నప్పటికీ మదుపరులు వేచిచూసే ధోరణిని అవలంభించడమే ఈ పరిస్థితికి కారణమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే అంతర్జాతీయ మార్కెట్లలో ద్రవ్య కొరత, మార్కెట్ ఒడిదుడుకులు కూడా ఎంఅండ్ఏ డీల్స్‌ను దించేశాయని గ్రాంట్ థోంటన్ భారత్ భాగస్వామి శాంతి విజేత అంటున్నారు. 'ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్.. అవకాశాల గనిగా విరాజిల్లుతున్నది. అయితే కరెన్సీ మార్కెట్‌లో రూపాయి తీరు, అంతర్జాతీయంగా నెలకొన్న అస్థిరత.. మదుపరులను ఊగిసలాటకు గురిచేస్తున్నది. ఈ సవాళ్లను భారత్ అధిగమించాల్సిన అవసరం ఉన్నది' అని విజేత అన్నారు. ఇదిలావుంటే నిర్మాణ రంగంలో జరిగిన సురక్ష గ్రూప్-జైపీ 2.5 బిలియన్ డాలర్ల లావాదేవీనే నిరుడు అతిపెద్ద డీల్‌గా ఉన్నట్టు తేలింది. కాగా, 2023లో మొత్తం 57 సంస్థలు ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ల (ఐపీవో)కు వచ్చాయి. మరోవైపు 6.2 బిలియన్ డాలర్ల నిధులను భారతీయ స్టాక్ మార్కెట్ల నుంచి సమీకరించాయి. అయినప్పటికీ 2022తో చూస్తే భారీగా తగ్గినట్టు గణాంకాలు చెప్తున్నాయి.

**దేశంలో విలీన-కొనుగోళ్ల లావాదేవీలు (బిలియన్ డాలర్లలో)**

| సంవత్సరం | విలువ |
|---|---|
| 2018 | 95 |
| 2019 | 60 |
| 2020 | 20.76 |
| 2021 | 107 |
| 2022 | 152 |
| 2023 | 66 |

# కొత్త ఫ్లైట్ల అవసరమెంతో..

### భారతీయ సంస్థలకు మరో 2,500 విమానాలు కావాలి: బోయింగ్

హైదరాబాద్, జనవరి 19 (బిజినెస్ బ్యూరో): భారతీయ విమానయాన రంగానికి 2042కల్లా 2,500లకుపైగా కొత్త ఎయిర్‌క్రాఫ్ట్‌ల అవసరం ఉన్నదని బోయింగ్ కమర్షియల్ మార్కెటింగ్ ఉపాధ్యక్షుడు డారెన్ హస్ట్ శుక్రవారం అన్నారు. ఇక్కడ జరుగుతున్న 'వింగ్స్ ఇండియా 2024' సందర్భంగా ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ.. నానాటికీ పెరుగుతున్న ప్రయాణికులు, కార్గో డిమాండ్ దృష్ట్యా దక్షిణాసియా దేశాల్లోని విమానయాన సంస్థలు తమకున్న ఎయిర్‌క్రాఫ్ట్‌లను పెంచుకునే దిశగా అడుగులు వేస్తున్నట్టు చెప్పారు. దీన్నిబట్టి వచ్చే రెండు దశాబ్దాల్లో 2,700లకుపైగా కొత్త విమానాలు అవసరమన్నారు. ఇందులో ఒక్క భారత్‌లోనే 2,500లకుపైగా నయా ఎయిర్‌క్రాఫ్ట్‌ల అవసరం ఉందని అంచనా వేశారు. 2,300 సింగిల్ ఎస్సెల్, 400 వైడ్ బాడీ ఎయిర్‌క్రాఫ్ట్‌ల అవసరం ఉంటుందని వివరించారు.



**కరోనాకు ముందున్న స్థాయికి..**

ఆసియా దేశాల్లో విమానయాన రంగంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న దేశం భారతేనని బోయింగ్ స్పష్టం చేసింది. కరోనాకు ముందున్న స్థాయికి మళ్లీ దేశీయ విమాన ప్రయాణికుల రద్దీ పెరిగిందని తెలిపింది. కరోనాతో వచ్చిపడిన ఆంక్షల కారణంగా విమానయాన రంగం తీవ్రంగా దెబ్బతిన్న విషయం తెలిసిందే. అయితే ఇప్పుడు తిరిగి అంతా విమానాల్లో ప్రయాణించేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఫలితంగా ఈ రంగానికి పూర్వ వైభవం రాగా, గతంతో పోల్చితే ఇంకా ఎక్కువే డిమాండ్ కనిపిస్తున్నది. దీంతో ఆయా సంస్థలు తమకున్న విమానాలను పెంచుకోవాలని చూస్తున్నాయి. ఇప్పటికే ఆయా కంపెనీలు 1,200లకుపైగా కొత్త విమానాల కోసం ఆర్డర్లిచ్చాయి.

**కార్గో విమానాలపై..**

ప్యాసింజర్ ట్రాఫిక్‌లోనేగాక, కార్గోలోనూ భారతీయ మార్కెట్ పరుగులు పెడుతున్నట్టు బోయింగ్ తెలియజేసింది. ఈ క్రమంలోనే రాబోయే 20 ఏండ్లకుపైగా కాలంలో 80 వరకు కార్గో విమానాల అవసరం దేశీయ విమానయాన సంస్థలకుంటుందన్నది. ఇప్పుడు కేవలం 15 సరకు రవాణా విమానాలే ఉన్నట్టు గుర్తుచేసింది. ఇటీవల ఆకాశంలోనే బోయింగ్ విమానం డోర్ ఊడిపోయిన ఘటన నేపథ్యంలో ఆయా సంస్థలకిచ్చే కొత్త విమానాల ఆర్డర్లు ఆలస్యమవుతాయా? అన్న ప్రశ్నకు హస్ట్ స్పందిస్తూ.. అలాంటిదేమీ ఉండబోదన్నారు. అనుకున్న సమయానికే డెలివరీలుంటాయని, నాణ్యత విషయంలో రాజీపడబోమని చెప్పారు.



డార్రెన్ హస్ట్

### ఎయిర్‌బస్, హెలిగో జట్టు

హెలిగో చార్టర్ ప్రైవేట్ లిమిటెడ్‌తో ఒప్పందం చేసుకున్నట్టు ఎయిర్‌బస్ హెలిక్యాప్టర్స్ తెలిపింది. దేశంలో ఆఫ్‌షోర్, ఆన్‌షోర్ కార్యకలాపాల కోసం ఎయిర్‌బస్ హెచ్145 హెలిక్యాప్టర్ల సేవల నిమిత్తం ఈ డీల్ జరిగింది. కాగా, ఈ కాంట్రాక్ట్ కాలపరిమితి ఐదేండ్లు. ఇందులో నిర్ణీత రేటులో గంటలవారీగా చెల్లింపు విధానం ఉండనుండగా, ఇది హెలిగోకు లాభదాయకమని ఎయిర్‌బస్ పేర్కొన్నది. ఇక ఓఎన్జీసీ ఆఫ్‌షోర్ అవసరాలకు ఈ హెలిక్యాప్టర్ సేవలను అందిస్తున్నట్టు హెలిగో తెలియజేసింది.

### జెట్‌సెట్‌గో మెగా డీల్

ఎయిర్ సర్వీసెస్ ఆపరేటర్ జెట్‌సెట్‌గో.. మూడు గ్లోబల్ ఏవియేషన్ టెక్నాలజీ సంస్థలతో 1.3 బిలియన్ డాలర్లకుపైగా విలువైన ఒప్పందాలను కుదుర్చుకున్నది. వీటిలో భాగంగా 280 హైబ్రిడ్-ఎలక్ట్రిక్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు జెట్‌సెట్‌గోకు అందనున్నాయి. అయితే 130 విమానాలు అవసరమైతే తీసుకోవచ్చు లేదంటే మానుకోవచ్చు. కాగా, ఈ విమానాలను ఎయిర్‌పోర్ట్ ట్రాన్స్‌ఫర్స్, రీజినల్ కనెక్టివిటీ, ఇంటర్-సిటీ కమ్యూట్, ఇంట్రా-సిటీ షటిల్స్, అర్బన్ ఎయిర్ ట్యాక్సీలుగా జెట్‌సెట్‌గో వాడనున్నది.

### మార్చికల్లా మరిన్ని ఆర్డర్లు

దేశీయ విమానయాన సంస్థలు విస్తరణపై దృష్టి పెట్టాయని, దీంతో వచ్చే ఏడాది మార్చికల్లా ఆయా సంస్థల ఎయిర్‌క్రాఫ్ట్ ఆర్డర్లు 2వేలను చేరవచ్చని ఏవియేషన్ రిసెర్చ్, కన్సల్టింగ్ సంస్థ క్యాపా ఇండియా తెలిపింది. ఇప్పటికే 1,620 కొత్త విమానాల ఆర్డర్లున్నాయని గుర్తుచేసింది. స్పైస్‌జెట్, గోఫస్ట్ ఆర్డర్లు వీటిలో లేవన్నది. కాగా, ఎయిర్ ఇండియా, ఇండిగో, ఆకాశ ఎయిర్ తదితర సంస్థల ఆర్డర్లు ఇందులో ఉండగా, గురువారం ఆకాశ ఎయిర్.. బోయింగ్‌కు 150 విమానాల ఆర్డర్లిచ్చినది తెలిసిందే.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.